అక్షర దర్బార్

www.aksharadarbar.com

voice of the people

వెల ₹5

సోమవారం 25, నవంబర్ 2024 | సంపుటి :02 | సంచిక :248 | పేజీలు :05

ఏసీబీ వలలో ఇరిగేషన్ ఏఈ..

రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన నర్సింగరావు

పెద్దపల్లి జిల్లాలో ఘటన

03

మిల్లర్లకు హెచ్చరిక

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవంటూ కలెక్టర్ సత్య శారద వార్నింగ్
- ధాన్యం సేకరణ, కస్టం మిల్లింగ్ రైస్‌పై కలెక్టరేట్‌లో సమావేశం

03

రేవంత్‌కు బుద్ధి చెప్తం..

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించే వరకూ పోరాటం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ మహాధర్నా ..
- తరలివచ్చిన నేతలు, పార్టీ శ్రేణులు

02

ఒంటరి మహిళలే టార్గెట్

- జల్సాలకు అలవాటుపడి చోరీలు
- ఇద్దరు దొంగల అరెస్ట్.. నిందితుల్లో మైనర్
- రూ. 80 వేల నగదుసహా బైక్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం

04

గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన మహా ధర్నా కొత్త చర్చకు తెరలేపింది. అధికార కాంగ్రెస్‌ను ఇరుకునపెట్టే ఉద్దేశంతో గులాబీపార్టీ జిల్లాకేంద్రంలో నిర్వహించిన మహాధర్నా అభాసుపాలైందని.. ఎరక్కపోయి బీఆర్ఎస్ నేతలు ఇరుకుపోయారనే టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ వ్యవహారం మహాధర్నాలో హాట్ టాపిక్ అయింది. పార్టీకి మైలేజ్ కోసం అట్టహాసంగా ఏర్పాటుచేసిన మహాధర్నాతో శంకర్‌నాయక్ భూకబ్జాల పర్వం మరోమారు తెరపైకి తెచ్చినట్లయింది. శంకర్‌నాయక్ కన్నుపడిందంటే ఎలాంటి భూమైనా ఖతమే అన్న ప్రచారం గతంలో నుంచి ఉంది. పదేండ్లు ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో అధికారం అడ్డుపెట్టుకొని ఇష్టారాజ్యంగా భూకబ్జాలకు పాల్పడ్డాడని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాకేంద్రంలో మెడికల్ కళాశాల నిర్మాణం కోసం గిరిజనుల భూములు అక్రమంగా గుంజుకున్నాడని అప్పట్లో బాధితులు ఆందోళనకు దిగారు. మానుకోట పట్టణంతోపాటు నియోజకవర్గంలో దళిత, గిరిజన, పేద రైతుల భూములతోపాటు, అసైన్డ్ భూములను బెదిరించి లాక్కున్నాడని విమర్శలు వెల్లువెత్తాయి. ఆయన ఆగడాలు భరించలేక పలువురు పోలీసులకు ఫిర్యాదులుసైతం చేశారు. ఇప్పటికీ కొన్ని భూకబ్జాకేసులు నమోదై ఉన్నాయి. తాజాగా.. హన్మకొండ సుబేదారి పోలీస్ స్టేషన్‌లోనూ ఇటీవల శంకర్‌నాయక్‌పై భూకబ్జా కేసు నమోదైంది. ఈక్రమంలోనే.. ఇవాళ మానుకోట జిల్లాకేంద్రంలో బీఆర్ఎస్ మహాధర్నా నిర్వహించడం, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను పక్కన పెట్టుకొని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గిరిజన, దళిత, పేద రైతులకు అండగా ఉంటామని ప్రసంగించడం విని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. స్టేజీపై మిగిలిన నేతలు సైతం కొంత ఇబ్బందిపడటం గమనార్హం. - అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

02

ఇరకాటం

ఎరక్కపోయి ఇరుకున్న బీఆర్ఎస్ నేతలు

కొత్త చర్చకు తెరలేపిన మానుకోటలో బీఆర్ఎస్ మహా ధర్నా ..

మరోమారు తెరపైకి శంకర్‌నాయక్ భూబాగోతాలు



- మాజీ ఎమ్మెల్యేపై గతంలో నుంచే అనేక భూకబ్జా ఆరోపణలు.. కేసులు !
- తాజాగా ఈనెల 20న హన్మకొండ సుబేదారిలో ఎఫ్ఐఆర్..
- గిరిజన, దళిత, పేద రైతులకు అండగా ఉంటామన్న గులాబీ నేతల భరోసా
- నేతల ప్రసంగాలు విడ్డూరమంటూ జనం విస్మయం

ఇరకాటం..!

ఎరక్కపోయి ఇరుకున్న బీఆర్ఎస్ నేతలు

- కొత్త చర్చకు తెరలేపిన మానుకోటలో బీఆర్ఎస్ మహా ధర్నా ..
- మరోమారు తెరపైకి శంకర్‌నాయక్ భూబోగోతాలు
- మాజీ ఎమ్మెల్యేపై గతంలో నుంచే అనేక భూకబ్జా ఆరోపణలు.. కేసులు !
- తాజాగా ఈనెల 20న హన్మకొండ సుబేదారిలో ఎఫ్ఐఆర్..
- గిరిజన, దళిత, పేద రైతులకు అండగా ఉంటామన్న గులాబీ నేతల భరోసా
- నేతల ప్రసంగాలు విడ్డూరమంటూ జనం విస్మయం

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన మహా ధర్నా కొత్త చర్చకు తెరలేపింది. అధికార కాంగ్రెస్‌ను ఇరుకునపెట్టే ఉద్దేశంతో గులాబీ పార్టీ జిల్లాకేంద్రంలో నిర్వహించిన మహాధర్నా అభాసు పాలైందని.. ఎరక్కపోయి బీఆర్ఎస్ నేతలు ఇరుకుపోయారనే టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ వ్యవహారం మహాధర్నాలో హాట్ టాపిక్ అయింది. పార్టీకి మైలేజ్ కోసం అట్టహాసంగా ఏర్పాటుచేసిన మహాధర్నాతో శంకర్‌నాయక్ భూకబ్జాల పర్వం మరోమారు తెరపైకి తెచ్చినట్లయింది.
శంకర్‌నాయక్ కన్నుపడిందంటే ఎలాంటి భూమైనా ఖతమే అన్న ప్రచారం గతంలో నుంచి ఉంది. పదేండ్లు ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో అధికారం అడ్డుపెట్టుకొని ఇష్టారాజ్యంగా భూకబ్జాలకు పాల్పడ్డాడని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాకేంద్రంలో మెడికల్ కళాశాల నిర్మాణం కోసం గిరిజనుల భూములు అక్రమంగా గుంజుకున్నాడని అప్పట్లో బాధితులు ఆందోళనకు దిగారు. మానుకోట పట్టణంతోపాటు నియోజకవర్గంలో దళిత, గిరిజన, పేద రైతుల భూములతోపాటు, అసైన్డ్ భూములను బెదిరించి లాక్కున్నాడని విమర్శలు వెల్లువెత్తాయి. ఆయన ఆగడాలు భరించలేక పలువురు పోలీసులకు ఫిర్యాదులుసైతం చేశారు. ఇప్పటికీ కొన్ని భూకబ్జాకేసులు నమోదై ఉన్నాయి. తాజాగా.. హన్మకొండ సుబేదారి పోలీస్ స్టేషన్‌లోనూ ఇటీవల శంకర్‌నాయక్‌పై భూకబ్జా కేసు నమోదైంది. ఈక్రమంలోనే.. ఇవాళ మానుకోట జిల్లాకేంద్రంలో బీఆర్ఎస్ మహాధర్నా నిర్వహించడం, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను పక్కన పెట్టుకొని వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ గిరిజన, దళిత, పేద రైతులకు అండగా ఉంటామని ప్రసంగించడం విని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. స్టేజీపై మిగిలిన నేతలు సైతం కొంత ఇబ్బందిపడటం గమనార్హం.

అనేక ఆరోపణలు..

మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మొదటి నుంచి వివాదాలకు కేరాఫ్‌గా ఉన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆయన మానుకోటతోపాటు వరంగల్ నగరంలో భూదందాలు మొదలుపెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో కాజీపేట శివారులోని అసైన్డ్ ల్యాండ్ లాక్కుని, దౌర్జన్యానికి దిగుతున్నారనే వ్యవహారం కలకలం రేపింది. అప్పట్లో బాధితులు ధర్మసాగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా హనుమకొండలోని న్యూశాయంపేటలో నిరుపేద కుటుంబానికి చెందిన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించడం.. ఆ ల్యాండ్ లో ఉన్న కంటైనర్ ఇంటిని ఎత్తుకెళ్లడంతో ఆ పంచాయితీ కూడా పోలీస్ స్టేషన్‌కు చేరడం కలకలమే రేపింది. దీంతో బాధితురాలు ఫిర్యాదుతో ఈనెల 20న హన్మకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓడిపోవడం, ఎమ్మెల్యే పదవి లేకపోవడంతో శంకర్ నాయక్ బాధితులు మరికొందరు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారని, మరిన్ని భూబాగోతాలు బయటకు వచ్చే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది.
శంకర్ నాయక్ వరంగల్ నగరంలో కొంతకాలంగా అసైన్డ్ భూములతో పాటు నిరుపేదల భూములపై కన్నేశాడనే ప్రచారం ఉంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఘటనలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తుండగా.. తాను కన్నేసిన భూములను కబ్జా చేసేందుకు శంకర్ నాయక్ ప్రత్యేకంగా గ్యాంగులు కూడా మెయింటైన్ చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి.

భయపడే ప్రసక్తే లేదు..

గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహాధర్నాకు ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరై ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. పార్టీ శ్రేణుల్లో జోష్ నింపే ప్రయత్నం చేశారు. ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్రకు పోయి కూడా ఆడబిడ్డలను మోసం చేసే ప్రయత్నం చేస్తే అక్కడి ఆడబిడ్డలు బుద్ధి చెప్పారని తెలిపారు. తెలంగాణలో ఆడబిడ్డలను మోసం చేశాడని చైతన్యం ప్రదర్శించి తన్ని తన్ని తరిమేశారని ఎద్దేవ చేశారు. నేను ఇక్కడకు వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతమని అంటున్నారని కేటీఆర్ తెలిపారు. నేను డీజీపీ, ఎస్పీ గారిని అడుగుతున్నా.. రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసులు మా మీద మాత్రమే పెడుతారా? కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద కేసులు ఉండవా? అని నిలదీశారు. మా గిరిజన రైతుల కోసం కదులుతూ మానుకోటలో ధర్నా చేస్తామంటే...లగచర్లలో జరిగిన సంఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకు అని డీజీపీ ప్రశ్నించారని తెలిపారు. కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళితులు, బీసీలు, గిరిజనులు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. సన్నకారు, బక్క చిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే దాకా వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించ ారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామంటే, పెట్రోల్ పోస్తామంటే భయపడమని కేటీఆర్ అన్నారు. మేము కేసీఆర్ తయారు చేసిన దళం.. భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మానుకోట రాళ్ల మహత్మ్యం ఏందో తెలంగాణను అడ్డుకున్న వాళ్లందరికీ తెలుసని అన్నారు.

రేవంత్‌కు బుద్ధి చెప్తం

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించే వరకూ పోరాటం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మానుకోటలో బీఆర్ఎస్ మహాధర్నా ..
- తరలివచ్చిన నేతలు, పార్టీ శ్రేణులు

అక్షరదర్బార్, మహబూబాబాద్ : తెలంగాణ ఉద్యమాన్ని మానుకోట ఘటన మలుపు తిప్పిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తెలిపారు. కొత్త నియంత సీఎం రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పేందుకు మానుకోట గడ్డ సిద్ధమైందని హెచ్చరించారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే నిరసనలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించే వరకూ తాము పోరాడతామని కేటీఆర్ హెచ్చరించారు. గిరిజన, దళితులు, రైతులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మహబూబాబాద్‌లోని తహసీల్ ఎదుట ఇవాళ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా జరిగింది. ఈ ధర్నాలో కేటీఆర్ పాల్గొని రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, అర్వపల్లి, మరిపెడ బంగ్లా మీదుగా ధర్నాకు భారీ కాన్వాయ్‌తో కేటీఆర్ చేరుకున్నారు. స్థానిక బీఆర్ఎస్ నేతలు ధర్నాకు ఏర్పాట్లు చేశారు. బీఆర్ఎస్ ధర్నా సందర్భంగా భారీగా పోలీసులు మోహరించారు.

ఉరికించి కొట్టేటోళ్లు..

ప్రజల కోసం లబ్ధి చేకూర్చే పనులు చేయకుండా... కుటుంబానికి లాభం చేసేందుకే రేవంత్ పనిచేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. లగచర్లకు అధికారులు పోతే దాడి చేశారని.. రేవంత్ రెడ్డి పోతే ఉరికించి కొట్టేవారని హెచ్చరించారు. ఫార్మా విలేజ్ కోసం 3వేల ఎకరాలు సేకరిస్తామంటే లగచర్ల రైతులు నిరసనకు దిగారని చెప్పారు. 9నెలలుగా వారు నిరసన చేస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్రలో రేవంత్ రెడ్డిని తన్ని తరిమారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు రాళ్లతో కొడతామంటే భయపడతామనుకున్నారా.. ఇది కేసీఆర్ తయారు చేసిన సైన్యమని.. ఊరూరా రేవంత్ రెడ్డి సర్కారుకు బుద్ధి చెప్పేందుకు రెడీగా తమ సైన్యం ఉందని కేటీఆర్ తెలిపారు.

పార్లమెంట్ సమావేశాలు షురూ..

- డిసెంబర్ 20 వరకు సభలు..
- ఆరోగ్యకరమైన చర్చలు జరపాలని ఎంపీలకు ప్రధాని మోడీ విజ్ఞప్తి



అక్షరదర్బార్, ఢిల్లీ : పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి. డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి. సమావేశాల సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోడీ ... పార్లమెంట్‌లో ఆరోగ్యకరమైన చర్చలు జరపాలని ఎంపీలందరికీ విజ్ఞప్తి చేశారు. విపక్షాలను టార్గెట్ చేస్తూ.. పార్లమెంట్‌లో చర్చకు అనుమతించడం లేదని ఆరోపించారు. 'ఇది 2024 సంవత్సరానికి చివరి కాలం' అని అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 75వ వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించడానికి రేపు అందరూ రాజ్యాంగ పరిషత్‌లో కలిసి రావాలని ప్రధాని కోరారు.

పోలీస్ ఇంటెలిజెన్స్ ఆరా!

- ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిన సింగరేణి భూఆక్రమణ అంశం
- అవినీతి అధికారులు, సిబ్బందిలో వణుకు
- ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించే పనిలో నిమగ్నం
- భూకబ్జాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మిక వర్గం

సింగరేణి భూమిలో అక్రమంగా నిర్మించిన భవనం

అక్షరదర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సింగరేణికి చెందిన భూమిని ఆక్రమించుకొని పక్కా భవనాలు నిర్మించుకున్న విషయమై 'అక్షర దర్బార్' లో రెండు రోజులు వరసగా కథనాలు ప్రచురితం కావటంతో ఈ అంశంపై పోలీస్ ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. మరోవైపు భూ అక్రమణ అంశం సింగరేణి ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో భూ ఆక్రమణదారులతో కుమ్మక్కైన పలువురు సింగరేణి అధికారులు, సిబ్బంది వణికిపోతున్నట్లు సమాచారం. భార్య పిల్లలతో పాటు తల్లిదండ్రులు తన వెంటే ఉన్న సందర్భంలో తామున్న సింగరేణి క్వార్టర్ ముందు చిన్నపాటి షెడ్డు వేసుకుంటే ఆగమేఘాల మీద వచ్చి కూల్చివేసే సింగరేణి అధికారులు సిబ్బంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రధానమైన బిజినెస్ సెంటర్ అయిన అంబేద్కర్ సెంటర్ నుండి సుభాష్ కాలనీ మీదుగా కేటీకే ఓసిపి-2 దాని రోడ్డు వరకు ఉన్న సింగరేణి రోడ్డు ఇరువైపులా సింగరేణి సంస్థకు చెందిన విలువైన భూమిని పెద్ద ఎత్తున ఆక్రమించుకొని భూ ఆక్రమణదారులు పక్కాగా భవన నిర్మించుకొని ప్రతి ఏటా రూ లక్షల్లో అద్దెకిస్తున్నప్పటికీ భూపాలపల్లి ఏరియాకు చెందిన సంబంధిత విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది సంబంధిత ఆక్రమణకు గురైన సింగరేణి భూమిని స్వాధీనపరచుకొని సంబంధిత భూ ఆక్రమణ చర్యలు తీసుకోకుండా ఎందుకు మిన్నకుండిపోతున్నారని, వారు ఇరువురు మధ్య ఏదో మతలాబు ఉంటేనే చర్యలు తీసుకోవడం లేదని సింగరేణి కార్మిక వర్గం ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. ఇది ఇలా ఉండగా భూపాలపల్లి ఏరియాలో భూ ఆక్రమణదారులకు వత్తాసు పలికిన సంబంధిత సింగరేణి విభాగాలలోని కొందరు అవినీతి అధికారులు సిబ్బంది ఈ భూ ఆక్రమణ అంశాన్ని చిన్నపాటి అంశంగా సింగరేణి ఉన్నతాధికారులకు చూపించే విధంగా తమ ప్రయత్నాల్లో నిమగ్నమైనట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం.

చర్యలు తీసుకోవాలి

హెచ్ఎంఎస్ భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్

లక్షల ఖరీదు చేసే విలువైన సింగరేణి భూముల్లో అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలి. సింగరేణి క్వార్టర్ ముందు చిన్న రేకుల షెడ్డు వేసుకుంటేనే హడావుడి చేసే సింగరేణి అధికారులకు బహిరంగంగా భూ ఆక్రమణలు జరుగుతుంటే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు?. సత్వరమే విచారణ చేపట్టి భూములను స్వాధీనం చేసుకోవాలి.

వెంటనే స్వాధీనం చేసుకోవాలి

తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య

సింగరేణిలో పదేళ్లుగా రాజకీయ జోక్యంతో విలువైన సింగరేణి భూములు కబ్జాకు గురయ్యాయి. కొంతమంది రాజకీయ నాయకులు సింగరేణి అధికారులతో కుమ్మక్కై విలువైన భూములను కబ్జా చేశారు. ఇప్పటికైనా ఆక్రమణకు గురైన భూములను వెలికితీసి స్వాధీనం చేసుకోవాలి.

చీరెలు కట్టుకొని దివ్యాంగుల నిరసన

- బస్సుల్లో సీట్లు దొరకడంలేదని ఆవేదన
- ప్రభుత్వం స్పందించాలంటూ వేడుకోలు

అక్షరదర్బార్, వర్ధన్నపేట : వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలో వికలాంగులు వినూత్న నిరసన చేపట్టారు. ఆర్టీసీ బస్సుల్లో తమకు కేటాయించిన సీట్లలో మహిళలు కూర్చొని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈమేరకు సోమవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చీరలు కట్టుకొని వికలాంగులు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటి నుండి వికలాంగులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. తమకు కెటాయించిన సీట్లలో తాము కూర్చోలేక ఒంటికాలుతో నిల్చొని ప్రయాణం చేయడం ఇబ్బందికరంగా ఉందని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులపై దృష్టి సారించింది బస్సులో కేటాయించిన 3 లేదా 4 సీట్లను తమకు వదిలేసేలా చొరవచూపాలని ప్రభుత్వాన్ని కోరారు.

బస్సు స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

ఏసీబీ వలలో ఇరిగేషన్ ఏఈ..

- రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన నర్సింగరావు
- పెద్దపల్లి జిల్లాలో ఘటన

అక్షరదర్బార్, పెద్దపల్లి: పెద్దపెల్లి పట్టణం ఎస్సారెస్పీ నీటి పారుదుల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ నర్సింగరావు ఏసీబీ వలకు చిక్కాడు. కాంట్రాక్టర్ వద్ద నుండి రూ.20 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోదక శాఖ అధికారులకు చిక్కాడు. కాంట్రాక్టర్ వద్ద రోడ్డుపైన డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆఫీస్‌లో విచారించారు. నర్సింగరావును అరెస్ట్‌చేసి కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు.

ఆ పెట్రోల్ బంకుపై ఎందుకంత ప్రేమ!

- నిర్వాహకులతో అధికారులకున్న లింకు ఏంటి?
- ప్రమాదాలకు నిలయంగా మారుతున్న బంక్ పరిసరాలు
- ప్రయాణికుల నిరసన.. పట్టించుకోని అధికారులు

అక్షరదర్బార్, పరకాల: పరకాల– హుజరాబాద్ ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. ప్రతినిత్యం ఈ రహదారిపై ఎక్కడో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఇలాంటి మెయిన్ రోడ్డుపై ప్రమాదాలను అరికట్టాల్సిన అధికారులు ప్రోత్సహించే రీతిలో వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ రహదారిపై నడికూడ మండల కేంద్రంలో ఉన్న డివైడర్ ను ఓ పెట్రోల్ బంకు వద్ద అడ్డుగా ఉందని నిర్వాహకులు నిబంధనలను పాతరేస్తూ ఇటీవల ధ్వంసం చేసినా సంబంధిత అధికారులు స్పందించకపోవటాన్ని ప్రయాణికులు నిరసిస్తున్నారు. అవసరమైన చోట రహదారిపై ప్రభుత్వం డివైడర్ నిర్మిస్తే అడ్డుగా ఉందని పెట్రోల్ బంకు నిర్వాహకులు తొలగించటం వల్ల ప్రమాదలు మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు మొరపెట్టుకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడంలో ఆంతర్యం ఏమిటనేది సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆ పెట్రోల్ బంకుపై అధికారులకు ఎందుకు అంత ప్రేమ? అని ప్రయాణీకులు చర్చించుకుంటున్నారు.

నడికూడ మండలం కేంద్రంలో నూతనంగా ఏర్పడిన బంక్ యజమాని బంక్ కు అడ్డంగా ఉందని రోడ్డుపై ఉన్న డివైడర్ ను పగలగొట్టి తనకు అనుకూలంగా మార్చుకోవడంతో వాహనాలు ఒక్కసారిగా యూ టర్న్ తీసుకునే క్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ నెలలో బంక్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురై ఇద్దరు వ్యక్తులకు కాలు చెయ్యి విరిగిన సంఘటన జరిగింది. అటు పోలీసులకు, ఇటు ఆర్ అండ్ బీ అధికారులకు తెలిసినా ఆ బంక్ నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోపోవడం చర్చనీయమైంది

పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

బంకు వద్ద జరిగిన ఘటనపై ఆర్ అండ్ బీ అధికారి పరకాల పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చినట్లు జూన్ 25న తెలిపినా ఇప్పటివరకు ఆ బంక్ నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోకపోవడాన్ని స్థానికులు నిరసిస్తున్నారు. బంక్ యజమాని ఆరు నెలల నుండి ఇప్పటివరకు కూడా స్పందించకుండా తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుపై ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారులకు పెట్రోల్ బంక్ నిర్వాహకులకు లోపాయికారి ఒప్పందాలు జరిగాయని ఓపెన్ గానే చర్చించుకుంటున్నారు.

డివైడర్ లేకపోవడం వల్లే ప్రమాదం

పెట్రోల్ బంకు ముందు రహదారిపై డివైడర్ లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని బాధితులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పెట్రోల్ బంక్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

సోమవారం
25.11.2024
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

నా క్వారీ.. లారీలు.. ఇష్టం!

- ఉత్సవ విగ్రహంలా టీఎస్ఎండీసీ
- ఓవర్ లోడ్ ఇసుకతో దొరికిన ఒకరి లారీలు
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్

అక్షరదర్బార్, మహాదేవపూర్: కొద్దిరోజుల క్రితం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లాలోని అధికారులతో జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓవర్ లోడ్ పై ఆయన క్లాస్ తీసుకున్నారు. ఓవర్ లోడ్ నియంత్రించాలని, ఓవర్ లోడ్ వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, రోడ్లు దెబ్బతింటున్నాయని చెప్పారు. అంతేకాదు క్వారీల్లో పరిమితికి మించి ఇసుకను లారీల్లో లోడ్ చేయవద్దని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. అయినా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు, సూచనలను కొందరు బేఖాతర్ చేస్తున్నట్లు కనపడుతుంది. తాజాగా మహదేవపూర్ మండలంలోని పూసుకుపల్లి పలుగుల– 8 లో నుంచి పరిమితికి మించి లోడైన లారీలు ఓవర్ లోడ్ తో దొరకటం ప్రస్తుతం చర్చనీయమైంది. నా క్వారీ.. నా లారీలు.. నా ఇష్టం అనే రీతిలో వ్యవహరిస్తున్న యజమాని లారీలను శనివారం మహాదేవపూర్ పోలీసులు గుర్తించి లారీలపై ఓవర్ లోడ్ కేసు నమోదు చేశారు. కాగా, ఈ లారీలు పూసుకుపల్లి పలుగుల 8 క్వారీ యజమానివని తెలిసింది. ఈ క్వారీలో ఓవర్ లోడ్ సర్వసాధారణమైనట్లు సమాచారం. తన సొంత లారీలతోనే ఓవర్ లోడ్ చేసుకొని గత కొంతకాలంగా తన ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నట్లు వినికిడి. పట్టించుకోవాల్సిన టీఎస్ఎండీసీలోని కీలక అధికారి తనకేమీ తెలియదు అన్నట్లు ఉత్సవ విగ్రహంగా ఉంటున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఈ ఇసుక క్వారీలో ఆ యజమాని తన ఇష్టం వచ్చినట్లు ఇసుక క్వారీని నడిపిస్తూ ఎవరిని లెక్కచేయకుండా తన దారి రహదారి అన్నట్లు వ్యవరించడం, టిఎస్ఎండిసి అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు చూస్తుండటంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. గత కొంత కాలంగా నడుస్తున్న ఈ తతంగం లారీలను మహాదేవపూర్ పోలీసులు పట్టుకొని కేసు చేయడంతో బట్టబయలైంది. ఓవర్ లోడ్ పై అడుప దడప పోలీసులు మినహా ఆర్టీవో కానీ, విజిలెన్స్ కానీ దాడులు చేయక పోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. మండలంలో నడుస్తున్న కొన్ని క్వారీలలో యజమానులు ఇసుక క్వారీలను నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న టిఎస్ఎండిసి, మైనింగ్ శాఖలు తమ పరిధిలోకి రావు అన్నట్లు వ్యవహరిస్తుండటం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఎవరేం చేసుకుంటే ఏంటీ తమకు వచ్చే పర్సంటేజీలే ముఖ్యమనే రీతిలో వ్యవహరిస్తుండటం చర్చనీయాంశమైంది.

ఓవర్ లోడ్ తో దొరికిన ఇసుక లారీలు

కేంద్ర బృందం రాక

- వచ్చే నెల 3 వరకు జిల్లాలో పర్యటన
- ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించనున్న అధికారులు
- హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం

అక్షరదర్బార్, హన్మకొండ: రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర మానవాభివృద్ధి వనరుల సంస్థ అధికారుల బృందం జిల్లా పర్యటనకు వచ్చింది. నేటి నుంచి వచ్చే మూడో తేదీ వరకు జిల్లాలో ఎనిమిది మంది కేంద్ర అధికారుల బృందం పర్యటించనుంది. ఈమేరకు సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో కేంద్ర అధికారుల బృందం సమావేశమైంది. ధర్మసాగర్ మండలంలోని ధర్మసాగర్, తాటికాయల, పెద్ద పెండ్యాల, ఆత్మకూరు మండలంలోని ఆత్మకూరు, కామారం, పెంచికలపేట గ్రామాలతోపాటు పరకాల మున్సిపాలిటీని సందర్శించనున్నారు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల తీరుతెన్నులను కేంద్ర బృందం పరిశీలించనుంది. హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, జెడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలే టార్గెట్

* జల్సాలకు అలవాటుపడి చోరీలు..
* ఇద్దరు దొంగల అరెస్ట్..

అక్షరదర్బార్, హన్మకొండ: జల్సాలకు అలవాటుపడి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను సీసీఎస్, సుబేదారి పోలీసులు పట్టుకున్నారు. ఒంటరి మహిళలను టార్గెట్‌చేసి దోపిడీలకు పాల్పడుతున్న యువకులను అదుపులోకి తీసుకున్నారు. సుబేదారి పోలీస్‌స్టేషన్లో ఏసీపీ దేవేందర్‌రెడ్డి సోమవారం మీడియా సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. పట్టుబడిన నిందితుల్లో ఒకరు మైనర్ ఉన్నట్లు వెల్లడించారు. నిందితుల నుండి 10 గ్రాముల బంగారం.. రూ. 80, 000 వేల రూపాయల నగదు, ఒక బైక్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ వెల్లడించారు.

పేదోళ్ల ఇండ్లు రోడ్డు పాలేనా..?

- ఆదుకోవాలంటున్న బాధితులు
- నిష్కరణంగా వ్యవహరిస్తే ఆత్మహుతికి వెనుకాడబొమని వెల్లడి
- అధికారుల చర్యపై భగ్గుమంటున్న ప్రజాసంఘాలు

అక్షర దర్బార్, కేసముద్రం : కేసముద్రం పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.అయితే పట్టణ అభివృద్ధిలో భాగంగా కేసముద్రం పట్టణంలో బైపాస్ రోడ్ నిర్మాణం ప్రస్తుతం వివాదాస్పదమవుతుంది. పాలకవర్గం,జిల్లా అధికారులు తీసుకున్న నిర్ణయమే ఇందుకు ప్రధాన కారణం.బైపాస్ రోడ్డు నిర్మాణంతో ఇళ్ల స్థలాలను కోల్పోతున్న ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.గత పదిహేనేళ్ల క్రితం కొనుగోలు చేసిన స్థలాల్లో పక్కా ఇల్లులు నిర్మించుకున్నారు.అంతా సవ్యంగానే సాగుతుంది జీవన ప్రయాణం అనుకునేలోపే.. ప్రభుత్వం కూల్చివేతలు మొదలు పెట్టెందుకు సిద్ధమై.. ఆ బడుగు జీవుల్లో బ్రతుకు ఆశలని మంట కలిపింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో నిరుపేద కుటుంబాలు బైపాస్ రోడ్డువైపు.. ఇండ్ల స్థలాలను కొనుగోలు చేసారు.ఆ స్థలాలలో ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు.ఇదంతా సుమారు పదిహేనేళ్ల క్రితమే జరిగిపోయింది.ఇప్పుడు అకస్మాత్తుగా ఆర్&బీ అధికారులు.. రోడ్డు వెడల్పులో భాగంగా ఈ ఇండ్లకి రెడ్ మార్క్ వేశారు.దీంతో బాధితులు లబోదిబోమంటూ బోరున విలపిస్తున్నారు. అధికారులు వేసిన ఆ రెడ్ మార్కులు వారికి శాపంగా మారాయి.కాయ కష్టం చేసి.. సొంత ఇంటి కోసమే పెట్టుబడి పెడితే ఇప్పుడు అది ఉపయోగం లేకుండా పోవడం.. బూడిదలో పోసిన పన్నీరుగా మిగిలిపోతుంది అనే ఆలోచనే వాళ్ళ గుండెలు అవిసేలా చేస్తుంది.పక్కా ఇంటికి అనుమతి ఇచ్చి, నల్లా కనెక్షన్ ఇచ్చి,కరెంట్ మీటర్ ఇచ్చి... ఎన్నో ఏండ్లుగా వీటికి బిల్లులు కడుతుంటే.. ఇప్పుడు రోడ్డు వెడల్పు అని.. రోడ్డు పరిధిలోనిది అని చెప్పడం.. వారికీ కనీసం నోటీసులు ఇవ్వకుండా రెడ్ మార్క్ వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు బాధితులు.అధికారుల చర్యలతో బాధితుల్లో అనేకమంది పేద బిడ్డలు ఉండటానికి గూడు లేకుండా ఉండే పరిస్థితిలోకి నెట్టబడుతున్నారు.కాయ కష్టం చేసిన సొమ్ము... రోడ్డు పాలు అవుతుంటే వారి బాధ వర్ణనాతీతంగా ఉంది.

బాధితులకు నష్ట పరిహారం ఎందుకివ్వరు..?

పేదోడి ఇల్లు ప్రజా సౌకర్యాల కోసం కూల్చాల్సి వస్తే.. నష్ట పరిహారం ఇచ్చి ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలి.కానీ.. ఇక్కడ జరిగిన ఘటనలో అధికారులు ఇదేం పట్టనట్టుగా వ్యవహారిస్తున్నారు. దీంతో.. బాధితులు తమ స్థలాలు ఇవ్వబొమని తేల్చి చెప్తున్నారు.ఉండటానికి కట్టుకున్న ఇంటినే కూల్చేస్తాం అంటే.. తమ బ్రతుకు ఎట్లా అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి రోడ్డె ముఖ్యమైతే తమకు ఇందిరమ్మ ఇంటితో పాటు.. నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.ఇవేం కాదు.. మాదారిన మేం పోతాం అంటే... అధికారుల ఎదుటే ఆత్మహుతికి కూడా వెనుకాడబొమని ఖరాఖండిగా చెప్తున్నారు.

రోడ్డు వెడల్పును తగ్గించాలి.

ప్రభుత్వం చేపట్టిన రోడ్డు పనుల్లో పేదబిడ్డలు నష్టపోతున్నారు కాబట్టి.. అధికారులు రోడ్డు వెడల్పు తగ్గించాలని ప్రజాసంఘాల నాయాలు డిమాండ్ చేస్తున్నారు.బాధితులు చట్టబద్ధంగా కొనుగోలు చేసి.. కట్టుకున్న ఇంటిని రోడ్డు కోసం.. వారిని రోడ్డున పడేస్తామంటే ఊరుకునేది లేదని అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి.. బాధితులకి న్యాయం చేయాలనీ డిమాండ్ చేస్తున్నారు.

ఇల్లు పోతే ఆత్మహత్యే శరణ్యాం

- భూక్య సరోజ బాధితురాలు

కేసముద్రం బైపాస్ లో గత 15 ఏళ్ల నుండి ఇల్లుకట్టుకొని నివాసం ఉంటున్నాం.ఇప్పుడు రోడ్డు వెడల్పు లో మా ఇల్లు మొత్తం పోతదని అధికారులు అంటున్నారు.కాయా కష్టం చేసుకొని కట్టుకున్న ఇల్లు పోతే ఆత్మహత్యే శరణ్యాం.ప్రభుత్వం స్పందించి పునరాలోచన చేసి రోడ్డు వెడల్పును తగ్గించాలి.లేదా మాకు ప్రత్యామ్నాయంగా వేరే చోట స్థలంతో పాటు ఇల్లును నిర్మించాలి.ఇంత జరుగుతున్న స్థానిక ఎమ్మెల్యే ఎందుకు స్పందించరూ..? మా పేదల ఇండ్లే కనిపిస్తున్నాయా.మాకు న్యాయం చేయండి.

ఇసుక అందుబాటులో ఉండాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రజలు ఇళ్లు నిర్మించుకునేందుకు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అభివృద్ధి నిర్మాణ పనులకు ఇసుక అందుబాటులో ఉండేలా నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం సాయంత్రం భూపాలపల్లి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, మైనింగ్ ఏడీ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ ఇతర జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలు ఇళ్లు నిర్మించుకునేందుకు తప్పనిసరిగా అనుమతి ఇవ్వాలని అన్నారు. నియోజకవర్గంలో కొంత మంది రాత్రి వేళల్లో పక్క నియోజకవర్గాలకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని, అటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాలలో ఇంటి నిర్మాణాల కోసం ఇసుక అవసరమైతే స్థానిక పంచాయితీ సెక్రటరీల ద్వారా రసీదును పొంది ఇసుక తరలించాలని తెలిపారు. టేకుమట్ల – రాఘ

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

వరెడ్డిపేట మధ్య ఉన్న బ్రిడ్జి వద్ద నిల్వ అన్న ఇసుకను తీసేందుకు రిపోర్ట్ ను తయారు చేసి ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే కోరారు.

సివిల్ వివాదాలను కోర్టుల్లో పరిష్కరించుకోవాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి సివిల్ వివాదాలను కోర్టుల్లో పరిష్కరించుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివాస్ కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన 18 మంది నుంచి ఎస్పి పిర్యాదులు స్వీకరించి, వాటిని చట్టప్రకారం పరిష్కరించాలని సంబధిత పోలీసు అధికారులను అదేశించారు. అలాగే ప్రజల ఫిర్యాదులను పెండింగ్లో ఉంచరాదని వాటిని వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు.అలాగే శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని అన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

అక్షర దర్బార్,శాయంపేట : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పరకాల ఏసీపీ కిషోర్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు జీవితాన్ని నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రమోద్ కుమార్, ఎక్సైజ్ ఎస్సై సులోచన,తహసిల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో ఫణి చంద్ర, డాక్టర్ సాయి కృష్ణ, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

టెంట్ హౌస్ ను ప్రారంభిస్తున్న మందకృష్ణ మాదిగ

తేజస్ టెంట్ హౌస్ ప్రారంభించిన మందకృష్ణ

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణ కేంద్రంలోని గ్రెన్ మార్కెట్ ఎదురుగా ఏకు శంకర్ మాదిగ ఆధ్వర్యంలో తేజస్ టెంట్ హౌస్ అండ్ డెకరేషన్స్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అక్షర దర్బార్,కాటారం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. మండలంలోని విలాసాగర్ పరిధి మానేరు నది నుండి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారు. కాగా గంగారం క్రాస్ వద్ద ఇసుకతో వస్తున్న ట్రాక్టర్ ను ఆపి డ్రైవర్ ను విచారించగా అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది. దీంతో ట్రాక్టర్ ను సీజ్ చేసి డ్రైవర్ తైనేని శ్రీధర్, ఓనర్ బోద శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

అక్రమాలను అరికట్టాలి

అక్షర దర్బార్ నర్సంపేట: నర్సంపేట వ్యవసాయ మార్కెట్ లోని అక్రమాలను అరికట్టి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని సిపిఐ (ఎంఎల్) వరంగల్ జిల్లా నాయకులు మోడం మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం రైతులతో కలిసి నర్సంపేట వ్యవసాయ మార్కెట్ గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిపిఐ ఎంఎల్ వరంగల్ జిల్లా నాయకులు కామ్రేడ్ మోడెం మల్లేశం హాజరై మాట్లాడారు. నర్సంపేట వ్యవసాయ మార్కెట్ ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి నెలరోజులు గడుస్తున్నా అధికారులు ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. ధాన్యంలో తాలు, దస్సు ఉందంటూ బస్తాకు మూడు కేజీలు అదనంగా కాంటా వేస్తామంటూ అధికారులు రైతులను నష్టాల పాలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు స్పందించి ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ప్రతాపరెడ్డి వెంకన్న రమేష్ పూలక్కా పద్మ అరుణ విజయ రాజన్న రవి రాములు సత్యనారాయణ ఉన్నారు.

రైతు భరోసా ఏదీ?

- యాసంగిలోనైనా రైతు భరోసా అందేనా..?
- వానకాలం సీజన్లో అందని వైనం..

అక్షర దర్బార్, శాయంపేట : రైతులకు ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం రైతు భరోసా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. యాసంగి సీజన్ ప్రారంభమైన రైతు భరోసాపై రాష్ట్ర ప్రభుత్వం ఏలాంటి ప్రకటన చేయలేదు. వర్షాకాలం ముగిసిన ప్పటికీ రైతు భరోసా రైతులకు అందలేదు. యాసంగిలోనైనా రైతు భరోసా అందుతుందని అన్నదాతలు ఆశలతో ఎదురుచూస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరిట ప్రతి సీజన్ కి ఎకరాకి 5000వేల చొప్పున ప్రతిఏటా 10000 వేల పెట్టుబడి సాయం అందించిన విషయం తెలిసిందే. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతుబంధును రైతు భరోసా పేరుతో రైతులకు ఎకరాకు 7500కు పెంచి ప్రతి ఏటా 15 వేల రూపాయలు అందిస్తామని హామీ ఇచ్చింది.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా సంవత్సరం గడుస్తున్న ఇప్పటికీ రైతుల ఖాతాలలో ఆ నిధులు జమ కావడం లేదని దీంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారని సమాచారం. రైతు భరోసా కు సంబంధించిన విధి విధానాలు రూపొందిస్తున్నామని త్వరలో విడుదల చేస్తామని చెబుతున్న ఎప్పటిలోగా రైతు భరోసా నిధులు వస్తాయో.?లేదో స్పష్టంగా లేకుండా పోయిందని తెలుస్తుంది.? ప్రభుత్వం రైతు భరోసా ఎక్కడ స్పష్టంగా ప్రకటించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెట్టుబడులకు ఇబ్బంది పడుతున్నాం

- మాలోతు భాస్కర్,రైతు

వానాకాలంలో రైతు భరోసా రాకపోవడంతో పెట్టుబడుల కోసం ఇబ్బంది పడాల్సి వచ్చింది అని యాసంగి సీజన్ లో కూడా ప్రభుత్వం ఏమి చెప్పడం లేదు. రైతు భరోసా ఇస్తుందో లేదో ప్రకటించాలి.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

- ఏఐసిటియు జిల్లా అధ్యక్షులు కంచ వెంకన్న డిమాండ్

అక్షర దర్బార్,కేసముద్రం: కార్మికుల అభివృద్ధి కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐసిటియు జిల్లా అధ్యక్షులు కంచ వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం నాడు ఇనుగుర్తి మండలానికి చెందిన వందమంది కార్మికులు జిల్లా అధ్యక్షులు కంచ వెంకన్న ఆధ్వర్యంలో ఏఐసిటియు కార్మిక సంఘంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకులు కార్మిక వర్గ ప్రయోజనాలను విస్మరించారని అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని

మాట్లాడుతున్న కంచె వెంకన్న

తెలిపారు. కార్యక్రమంలో ముసుగు వెంకన్న,ఏ.సోమయ్య, ఎన్ మంగు, ఏ రాములు, కే యాకాంబం, పి బుచ్చయ్య, మాకు సూరయ్య, మాలి జంపయ్య, నద్దునూరి రాములు, మేకల రాజు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్ ను కలిసిన దొంతి

అక్షర దర్బార్ , నర్సంపేట తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని సోమవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.నేడు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా తాజా రాజకీయ పరిస్థితులపై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చర్చించారు.

నేటి నుండి వైజ్ఞానిక ప్రదర్శనలు

: వరంగల్ డీఈవో జ్ఞానేశ్వర్

అక్షర దర్బార్, నర్సంపేట : ఈ నెల 26 నుంచి 28 వరకు నర్సంపేట మండలం మహేశ్వరంలోని శివాని పబ్లిక్ స్కూల్ లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ ను నిర్వహించనున్నట్లు వరంగల్ డీఈవో జ్ఞానేశ్వర్ తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ, సృజనాత్మకతను పెంపొందించేందుకు సైన్స్‌ఫెయిర్ దోహదపడుతుందని. ప్రస్తుత సొసైటీకి అవసరమైన ఎగ్జిబిట్లను సైంటిఫిక్ ఆలోచనతో రూపొందించాలని సూచించారు. విద్యార్థులు 26న సైన్స్ ఫెయిర్ ప్రాంగణంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 500 వరకు ఎగ్జిబిట్లు ప్రదర్శించే అవకాశం ఉందని, సుమారు 5వేల మంది విద్యార్థులు ప్రదర్శనను వీక్షించేందుకు వస్తారని తెలిపారు.

చల్లా పరామర్శ..

అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలం పోచారం గ్రామ మాజీ సర్పంచ్ పెండ్లి బాపురెడ్డి తల్లి శాంతమ్మ కొద్దిరోజుల క్రితం మృతిచెందడంతో సోమవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పాము కాటుతో బాలుడు మృతి

అక్షర దర్బార్, కాటారం:కాటారం మండలం గారెపల్లిలో పాముకాటుతో నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.. ఎస్సై అభినవ్ వివరాల ప్రకారం ఏపీలోని ఒంగోల్ కు చెందిన ఉప్పలపాటి సత్యనారాయణ కుమారుడు అగు వేదాన్ష్ కార్తికేయ (4) గారెపల్లిలోని తన అమ్మమ్మ కల్లగుంట లక్ష్మి ఇంటి వద్ద ఆడుకుంటున్న క్రమంలో ఈనెల 21న పాముకాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.